క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి కృషి



హసన్‌పర్తి: పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు అంచూరి విజయ్ అన్నారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో బెంచీలు, డిజిటల్ క్లాస్ రూంలు, వాటర్ ప్లాంట్ సమకూర్చినట్లు చెప్పారు. 20మంది విద్యార్థినులకు సైకిళ్లు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ చిర్ర సుమలత, ఉపసర్పంచ్ రంజిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై చిన్నచూపు తగదు



కాజీపేట: పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని, పెండింగ్‌లో ఉన్న అపరిష్కృత డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అసోసియేషన్ మహాసభలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సమావేశానికి సిద్ది రాజయ్య అధ్యక్షత వహించగా నారాయణగిరి వీరన్న, టి.మల్లేశం, డి.సాంబమూర్తి, ఆంజనేయులు, రఘుపతిరావు, సారంగపాణి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ

కాజీపేట అర్బన్: నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ అందజేస్తోందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను శనివారం అందజేశారు.

సెయింట్ గాబ్రియెల్‌లో కేజీ డే



కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్‌లో శనివారం కేజీ విద్యార్థుల డే జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ హెడ్‌మాస్టర్ బ్రదర్ అరుణ్‌ప్రకాష్ మాట్లాడుతూ అతి పురాతనమైన స్కూల్ అయిన సెయింట్ గ్యాబ్రియేల్‌లో ఉన్నత విద్యను అందిస్తూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన చెప్పారు. సంప్రదాయ దుస్తుల్లో ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు అలరించారు.

పాఠశాలలో వీడ్కోలు సమావేశం



వరంగల్ చౌరస్తా: వరంగల్ జేపీఎన్ రోడ్డులోని పూర్ణోదయ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లోజు సత్యనారాయణ, సభ్యులు టి.సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్యాంప్రసాద్, శ్రీరాజ్, జగదీశ్వరి, అరవింద్, మధుకర్, జ్యోతి, మౌనిక, స్వాతి, వాణీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్, కారు ధ్వంసం





ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా బైక్, కారు ఢీకొని నుజ్జునుజ్జు కాగా, ప్రయాణిస్తువారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న ముగ్గురు యువకులు స్వల్పగాయాలతో బైక్‌ను వదిలేసి ఘటన స్థలం నుంచి పారిపోయారు. మిల్స్‌కాలనీ పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమేష్



ఖిలా వరంగల్: చీరలు పంపిణీ చేస్తూ..



సన్మాన గ్రహీతలతో బీఆర్‌ఎస్ నాయకులు



కాజీపేట: మహిళలను సన్మానిస్తున్న సుందర్‌రాజ్

మడికొండ: మహిళా సంక్షేమానికి, సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కాజీపేట మండలం మడికొండలోని శ్రీరాజరాజేశ్వర గార్డెన్‌లో కాజీపేట, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన మహిళా ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలను గౌరవించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ ఎదుగుదలతోనే దేశాభివృద్ధి

ఖిలా వరంగల్: పురుషుడితో సమానంగా స్త్రీ అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే దేశం మరింతగా అభివృద్ధి చెందుతుందని హైకోర్టు న్యాయవాది పోలెపాక చంద్రకళ, 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ అభిప్రాయపడ్డారు. వరంగల్ పడమరకోట జంక్షన్‌లో కాకతీయ రుద్రమాంబ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బైరబోయిన సరోజన ఆధ్వర్యంలో పేద వృద్ధ మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో సమానంగా ఎదగాలని సూచించారు. అనంతరం, అతిథులకు బైరబోయిన సరోజన జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సింగారపు అరుణ, తోట చంద్రకళ, చింతం రజిని, మంద శోభ, ధనలక్ష్మి, అనసూర్య, మంతర్తి నాగరాణి, అనిత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో చీరల పంపిణీ

హన్మకొండ చౌరస్తా: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా హనుమకొండ మచిలీబజార్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ 10వ డివిజన్ కార్యాలయంలో పలువురు మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్‌లోని ఆశ, ఆర్పీ, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేసి సన్మానించారు. బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిప్పర్తి ఈశ్వర్, శ్యామల సుధాకర్, పాదిలి అనిల్, పులి రాజు, వైనాల హైమావతి, రజియా, సుజాత, సరస్వతి పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

కాజీపేట: 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మహిళలను కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సుంచు కృష్ణ, కాటపురం రాజు, బస్వా యాదగిరి, పి.శివకుమార్, తేలు సారంగపాణి, అయ్యాల దానం, వి.రఘు, కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి



కాశిబుగ్గ: నినాదాలు చేస్తున్న నాయకులు

కాశిబుగ్గ: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని జాగృతి వరంగల్ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు పెండ్యాల సోనిబాబు డిమాండ్ చేశారు. కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాశిబుగ్గ జంక్షన్‌లో శనివారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సోనిబాబు మాట్లాడుతూ బాధ్యత గల పదవిలో ఉన్న బండి సంజయ్.. మహిళ అనే కనీస గౌరవం లేకుండా సభ్యసమాజం తలదించుకునే కవితపై వ్యాఖ్యలు చేయడం శోచనీయమని విమర్శించారు. కార్యక్రమంలో జాగృతి, బీఆర్‌ఎస్ నాయకులు ముష్క ప్రమీల, సుంకరి భాగ్యలక్ష్మి, కుసుమ నరేష్, జెక్కి యుగేందర్ కుమార్, సంపత్, కిన్నెర రంజిత్, జన్ను వినయ్ పాల్గొన్నారు.

తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య



విద్యార్థులతో ఉడుముల బాల, జయప్రతాప్‌రెడ్డి

కాజీపేట రూరల్: కాజీపేటలో తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్న క్రైస్తవ విద్యాసంస్థ బిషప్ బెరెట్టా స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుమల బాల, బిషప్ బెరెట్టా స్కూల్ హెడ్ మాస్టర్ ఫాదర్ జయప్రతాప్‌రెడ్డి సూచించారు. కాజీపేట బిషప్ బెరెట్టా హైస్కూల్‌లో యూకేజీ, 10వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఉడుముల బాల మాట్లాడుతూ క్రైస్తవ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో చాలామంది ఉన్నత స్థానంలో ఉన్నారని వివరించారు. డ్యాన్స్ మాస్టర్ పాలెపాక భుజంగరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆలపించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ ఫాదర్ జయపాల్, సిస్టర్ కల్పన, జీఎస్.రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం కేసులో నేతల పేర్లు బహిర్గతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: మద్యం వ్యాపారం చేసే వివిధ రాజకీయ పార్టీల నాయకుల పేర్లను బహిర్గతం చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలోని జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిని దెబ్బతీసే లిక్కర్ వ్యాపారంలో రాజకీయ నాయకులు కుంభకోణాలకు పాల్పడటం దుర్మార్గమని వాపోయారు. కొంతమంది నాయకులు లిక్కర్, రియల్ ఎస్టేట్, భూదందాలు, కబ్జాలు, సెటిల్మెంట్‌లకు పాల్పడుతూ పెద్దఎత్తున అక్రమంగా డబ్బులు సంపాదించి రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు డబ్బులు, మద్యం పంచి ప్రలోభాలకు గురిచేసి ప్రజాప్రతినిధులుగా గెలిచి మంత్రి పదవులు పొందుతున్నారని విమర్శించారు.

క్రైం కార్నర్

మనోవేదనతో వృద్ధురాలి ఆత్మహత్య

కాజీపేట: కాజీపేట బాపూజీనగర్ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం దండుగుల ఎల్లమ్మ (70) అనే వృద్ధురాలు గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ అనేక మందులను వాడుతోంది. దీంతో కడుపులో మంట సైతం ప్రారంభం కావడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఒంటిపై వంటనూనె పోసుకొని అంటించుకోగా ఎంజీఎంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కుమారుడు దండగుల బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

కాజీపేట: ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై బి.రాజేష్ ఆధ్వర్యంలో కాజీపేట పట్టణంలో వాహన తనిఖీలు చేపడుతుండగా నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతున్న మరుపాక అభిలాష్, పెండ్యాల కొమురయ్య, గడపబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ ఎస్సై ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.


చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ పెరకవాడకు చెందిన అల్లాని రాజశేఖర్ కమ్మరి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజువారీగా శుక్రవారం ఉదయం పనికి వెళ్లి చిన్న బ్రిడ్జి నుంచి కాలినడకన పెరకవాడకు బయల్దేరాడు. ఈక్రమంలో శాంతినగర్‌కు చెందిన రామ్‌రెడ్డి జనార్దన్‌రెడ్డి తన బైక్‌పై అతివేగంగా వెళ్తూ రాజశేఖర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో రాజశేఖర్ తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున రాజశేఖర్ తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుమారుడు అల్లాని చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముష్క శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక కారణాలతో మహిళ..

ఖిలా వరంగల్: ఆర్థిక కారణాలతో మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది గతనెల 22వ తేదీన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ కామనిపెంటకు చెందిన కొప్పుల కుమారస్వామి, అరుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మధ్య ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దాంతో మనోవేదనకు గురైన కొప్పుల అరుణ(35) గత నెల 22న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతూ శనివారం తుదిశ్వాస విడిచింది. మృతురాలు తండ్రి ఆళ్ల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముష్క శ్రీనివాస్ తెలిపారు.

అడ్తి వ్యాపారి హఠాన్మరణం



లచ్చయ్య (ఫైల్)

వరంగల్: వరంగల్‌లోని రామాంజనేయ అండ్ కంపెనీ అడ్తి దుకాణం యజమాని కోడూరు లచ్చయ్య(49) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు పరామర్శించి సానుభూతి తెలిపారు.

నగరంలో నేడు.. రేపు

నేడు 57వ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో

హన్మకొండ: హనుమకొండలోని 57వ డివిజన్‌లో ఈనెల 12న హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ హనుమకొండ బ్లాక్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హనుమకొండ గోకుల్‌నగర్ కూడలి నుంచి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభమవుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోని బేకరి, అశోకకాలనీ గాంధీ విగ్రహం, వికాస్‌నగర్, టీవీ టవర్ కాలనీ గాంధీ విగ్రహం, టీవీ టవర్ కాలనీ, కృష్ణాకాలనీ, వాజ్‌పేయి నగర్ మీదుగా సాయి గోకుల్‌నగర్, పోచమ్మ గుడి వద్ద యాత్ర ముగుస్తుందని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ ప్రమాణ స్వీకారం

కాశిబుగ్గ: వరంగల్ జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శివనగర్‌లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వడ్డె యుగేందర్ తెలిపారు. కాశిబుగ్గలోని పార్కులో యూనియన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్లంబింగ్ వర్కర్లు ప్రమాణ స్వీకారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

రేపు కలెక్టరేట్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

వరంగల్ రూరల్ / కాశిబుగ్గ: వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఈనెల 13వ తేదీన ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ గణేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల వైద్యులు శిబిరంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇస్తారని, మందులు పంపిణీ చేస్తారని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, పంచకర్మ, ఈఎన్‌టీ, నేత్ర, స్త్రీల సంబంధిత, పీడియాట్రిక్స్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

14న ఉచిత 'రుమటాలజీ' వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 14వ తేదీన హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత రుమటాలజీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు మధుకర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగే శిబిరంలో ప్రముఖ రుమటాలజిస్టు డాక్టర్ వి.సునీల్ పాల్గొని వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఈ క్యాంపులో రూ.2 వేల విలువైన ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. మోకాళ్ల అరుగుదల, మడమనొప్పి, నడుము, మెడ నొప్పులు, కీళ్ల వాపుల సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షల కోసం 99665 54455 నంబర్‌లో సంప్రదించి పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

16న ఆటో డ్రైవర్ల సమస్యలపై సమావేశం



కాజీపేట రూరల్: హనుమకొండలోని అంబేద్కర్ భవనంలో ఈనెల 16వ తేదీన ఆటో డ్రైవర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కాజీపేట ప్రతాపరుద్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గడ్డం నరహరి, సెక్రటరీ నాతి సత్యనారాయణ, ట్రెజరర్ శంకర్‌నాయక్ తెలిపారు. ఈమేరకు కాజీపేట ఆటో స్టాండ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమావేశానికి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, నగర మేయర్ సుధారాణి, వరంగల్ సీపీ రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్యతో పాటు ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఆర్టీఓలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

ఆ విద్యాసంస్థలను నిషేధించాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



అండర్‌బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నయీంనగర్: జిల్లాలో పలు కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని, విద్యార్థులను వేధిస్తూ వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను నిషేధించాలని ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. నయీంనగర్ సెంటర్‌లో ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను రద్దు చేయాలని శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లాలో శ్రీచైతన్య, నారాయణ కళాశాలలు అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కసరబోయిన రవితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల పీఆర్వోలను తరిమికొట్టండి

ఖిలా వరంగల్: తెలంగాణ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను నిషేధించాలని, అడ్మిషన్ల కోసం ఇంటికి వచ్చే పీఆర్వోలను తరిమికొట్టాలని ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను వేధిస్తూ ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల బ్రాంచీలను సీజ్ చేయాలని, అనుమతి లేకున్నా కొనసాగుతున్న విద్యాసంస్థలను మూసివేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, సురేందర్, చందన్, ప్రశాంత్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సభకు తరలిరావాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫోరం ప్రతినిధులు

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 12న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చిర్ర రాజుగౌడ్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ గేట్ ఎదురుగా ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల ఐక్యతను చాటిచెప్పాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కేయూ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, బాధ్యులు డాక్టర్ మామిడిశెట్టి నాగరాజు పటేల్, రఘురాం, తుపాకుల రవి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

కేర్ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న నిర్వాహకులు

దామెర: కేర్ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, సెక్రెటరీ డాక్టర్ డి. సుధీర్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని కేర్ ఫార్మసీ కళాశాలలో శనివారం జాతీయ సెమినార్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 13న సోమవారం బయో అనాలిటికల్ మెథడ్ డెవలప్‌మెంట్, చాలెంజెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ఫార్మస్యూటికల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టివి. నారాయణ, కామన్‌వెల్త్ ఫార్మసిస్టు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రావు వడ్లమూడి, జినీరా ఫార్మ కంపెనీ సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల, స్పెషల్ గెస్టుగా నంది పురస్కార అవార్డు గ్రహీత, ప్రముఖ జానపద గాయకుడు, తెలంగాణ ఉద్యమ రచయిత మిట్టపల్లి సురేందర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

'డిస్నీల్యాండ్'లో స్వయంపాలన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి నూతన అనుభూతిని పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌భాను, దినేష్‌చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోశాల సేవలో 'హెల్పింగ్ హార్స్'



అర్చకులను సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని గోవిందాద్రి గోశాలలో చేస్తున్న సేవలు వెయ్యి రోజులకు చేరిన సందర్భంగా హెల్పింగ్ హార్స్ ఫౌండేషన్ ప్రతినిధులు 30మంది బ్రాహ్మణులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకుడు లక్ష్మణ స్వామి, ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి, అర్చకులు జగన్నాథం, వెంకటేశ్వర్లు, కిరణ్, శ్రీధర్, వేణుమాధవ్, మురళీకృష్ణ, కృష్ణమూర్తి, విద్యాసాగర్, చింతల సంతోష్, జగన్నాథం, రామస్వామి, హెల్పింగ్ హార్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బి.రామకృష్ణ, టి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



కాజీపేట: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను శాశ్వత ఉద్యోగాల గుర్తించి ఆదుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను కాజీపేటలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అల్లం రవిందర్, కల్యాణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



కాజీపేట: బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డిని కాజీపేట పోలీస్ స్టేషన్‌లో స్థానిక యువజన సంఘం నాయకులు శనివారం సాయంత్రం సన్మానించారు. సుమారు రెండేళ్లకు పైగా పట్టణంలో శాంతి భద్రతలను కాపాడడంలో ఆయన చూపిన తెగువను పలువురు మెచ్చుకున్నారు. కార్యక్రమంలో మహమూద్, పాము రాజేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.